సూర్య
18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శనివారం 11 జనవరి 2025 పేజీలు 8

అంబాపురం పంచాయితీ పరిధిలో పోలీసుల బ్యానర్ ఒకవైపు..
మరోవైపు కోడి పందాల బరులకు ఫెన్సింగ్‌లు వేసేసిన నిర్వాహకులు



## వైసీపీ కోడిపందాల బరుల్లో...
# టీడీపీ పుంజులు

వివరాలు 2లో



అవే ప్రదేశాలు, అవే టెంట్లు
నేతలే చేంజ్..

- అంబాపురంలో బరులకు ఇనుప కంచెలు
- పాముల కాలువ వద్ద ఏకంగా కాలవనే ఆక్రమించి మరీ ర్యాంపు ఏర్పాటు
- కొత్తూరు తాడేపల్లిలో ఇప్పటికే పూర్తైన కోడి పందాలు, జూదం వేలంపాటలు
- భవానీపురంలోనూ మైదానం సిద్ధం నున్న, యనమలకుదురులోనూ సేమ్ సీన్
- ఓ వైపు పోలీసుల బ్యానర్లు .. మరో వైపు చకచకా పనులు
- ఎంపీ, ఎమ్మెల్యేల అండదండలతోనే కోడి పందాల బరులా..?

## గిరిజన మైనింగ్ ప్రాంతాల్లో...
# ఆరోగ్య ప్రదాయని ఆరోగ్య రథాలు

- కోటి రూపాయలతో రెండు ఆరోగ్య రథాల ప్రారంభం
- కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పేదలకు మెరుగైన వైద్యం
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర

వివరాలు 2లో












### కూటమి హయాంలో రహదారులకు మహర్దశ

**మొవ్వ (జనవరి 10) మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి స్వల్ప కాలంలోనే అభివృద్ధికి బాటలు వేస్తూ గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతోందని, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వమండలం అయ్యంకి గ్రామంలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు ఆరు లక్షల రూపాయలతో మంజూరైన బీసీ కాలనీలో అంతర్గతరహదారికి శుక్రవారం భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల పర్యవేక్షణలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి పలు రాష్ట్రాలకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ నాగనబోయిన సునీల్ కుమార్అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఉప సర్పంచ్ రాజుల పాటి సుబ్బారావు, పంచాయతీరాజ్ ఏఈ వాసుదేవరావు, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాసు, ఎంపిడిఓ జే విమాదేవి, ఈ.వో.పీ.ఆర్.డి. ఎం ఎస్ కే పరమాత్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభు కుమార్, గ్రామాల్లోని తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మండల పార్టీ అధ్యక్షులను శాలువాతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

### రూ.9లక్షలకు పైగా భారీ ఆస్తినష్టం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం మంగళాపురం బీసీ కాలనీలో గొరిపర్తి శ్రీనివాసరావుకు చెందిన పూరిల్లు శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదంలో దగ్ధమై భారీ ఆస్తినష్టం సంభవించింది. మినుములు అమ్మగా వచ్చిన నాలుగు లక్షల పైగా నగదును ఇంటిలో ఉంచటంతో ప్రమాదంలో నగదు, ఐదు సవర్ల బంగారం, వస్తుసామాగ్రి, ఇంటి పత్రాలు సర్వం అగ్నికి ఆహుతిగా మారి నిరాశ్రయులయ్యారు. శ్రీనివాసరావు కూలీపనికి వెళ్లిపోగా, భార్య, వికలాంగురాలైన కుమార్తె ఇంటిలో ఉన్నారు. మంటలు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో మంటలను చూసిన భార్య.. కుమార్తెను బయటకు తీసుకు వెళ్లింది. స్థానికులు మంటలను అదుపుచేయగా, అవనిగడ్డ అగ్నిమాపక అధికారులు సిబ్బందితో కలిసివచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. వీఆర్వో మల్లేశ్వరి ప్రమాదనష్టంపై తహసీల్దారు నివేదిక అందచేశారు. ప్రమాద కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్గా భావిస్తున్నారు. అగ్నిప్రమాద కారణంగా రూ.9లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనావేశామని అగ్నిమాపక అధికారి పివిఎస్వి.ప్రసాద్ తెలిపారు.

### ప్రవాస భారతీయ దంపతులకు సత్కారం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల లో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి నూతన రాజ గోపురం, మూలవిరాట్ విగ్రహాలకు ఘంటసాల కు చెందిన ప్రవాస భారతీయులు మూల్పూరి వెంకట్రావు - సావిత్రి దంపతులు రూ.10 లక్షల వితరణను అందజేశారు. ఆలయంలో నూతన రాజ గోపురం నిర్మాణంలో ఉంది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో రాజగోపురం నిర్మాణ దాతలు ఎన్ఆర్ఐ వెంకట్రావు- సావిత్రి దంపతులను ఆలయ ట్రస్టీలు తుమ్మల వర ప్రసాద్ , వేమూరి శివయ్య, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, విశ్రాంత ఎంఈఓ పోతన వెంకటేశ్వరరావు, గొర్రెపాటి విద్యా ట్రస్ట్ ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, వేమూరి రమేష్, తదితర ప్రముఖులు పూలదండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మొదట ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తుల విగ్రహాలకు రుత్విపకులు దివి వెంకట శేషాచార్యులు బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు జరిపారు. తీర్థ ప్రసాద వినియోగం జరిగింది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైసీపీ కోడిపందాల బరుల్లో టీడీపీ పుంజులు

**అవే ప్రదేశాలు, అవే టెంట్లు నేతలే చేంజ్..**



జక్కంపూడి పాముల కాలువ వద్ద కాలువకు ర్యాంపు వేసి మరీ లోపల మైదానంలో చదును చేసిన దృశ్యం



అంబాపురం పంచాయితీ పరిధిలో పోలీసుల బ్యానర్ ఒకవైపు మరోవైపు కోడి పందాల బరులకు ఫెన్సింగ్ లు వేసేసిన నిర్వాహకులు

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి 10, మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ అంటేనే కోడి పందాలు.. జూదం... అలాంటిది గత ఏడాది వైసీపీ హయాంలో నిర్వహించి ఈ ఏడాది కూటమి ప్రభుత్వంలో నిర్వహించకపోతే చెడ్డ పేరు వస్తుందనే భావనతోనే ఏమో తెలుగు తమ్ముళ్ల కోడి పందాల శిబిరాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఎక్కడైతే కోడి పందాలు నిర్వహించారో ఇప్పుడు అదే ప్రదేశంలో నిర్వహించాలనే ప్రెస్టేజియస్ తో పనులను మరింత వేగవంతం చేసేసినట్లు సమాచారం. పోలీసులు బరుల వద్ద బ్యానర్లు కట్టేసి మమ అనిపించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల నుంచి పోలీసులు అన్ని బరుల వద్ద పర్యటిస్తూ కోడి పందాలు, జూదం లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. ప్రతిచోటా బ్యానర్లు కడుతూనే ఉన్నారు. నిర్వాహకులు కూడా భయపడినంత పనిచేస్తూ బరుల వద్ద పోలీసులు ఉన్నంతసేపు దూరంగా ఉంటూ పోలీసులు వెళ్లగానే షరామామ్మూలుగానే బరుల వద్ద పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు స్థానికులు.

**అంబాపురం పంచాయితీ పరిధిలో..**

ముఖ్యంగా విజయవాడ శివారులో జరిగే కోడి పందాలకు రాజకీయ ప్రముఖుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో వైసీపీ హయాంలో జరిగితే ఇప్పుడు టీడీపీ హయాంలో జరుగుతుండడం విశేషం. సాధారణంగా అంబాపురం పంచాయితీలో బయట గేటుకు పోలీసులు బ్యానర్లు కట్టి ఉంటే లోపల మాత్రం ఇప్పటికే చిన్న బరి, పెద్ద బరిలకు ఫెన్సింగ్ వేసేశారు. మరికొన్ని చోట్ల జూదాలకు టెంట్లు వేసేలా చదును చేస్తుండడం పోలీసుల ఆదేశాలు ఎంతలా అమలవుతున్నాయో అంటూ పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.



**జక్కంపూడి పాములకాలువ వద్ద..**

మరోవైపు పాముల కాలువ వద్ద అయితే ఏకంగా కాలువపైనే ర్యాంపు వేసేసి గ్రౌండ్ లోకి మార్గం సుగమం చేసేశారు. అంతేకాకుండా లోపల ఖాళీ ప్రదేశాన్ని చదును చేసేశారు. అయితే తమ జక్కంపూడి గ్రామంలో కోడిపందాలు నిర్వహించవద్దంటూ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు స్థానికులు. అయినా పనులు జరుగుతుండడం విశేషం.

**కొత్తూరు తాడేపల్లిలో..**

నగర శివారులో కోడిపందాలకు కొత్తూరు తాడేపల్లి టాప్.. పెద్ద బరి, చిన్న బరితో పాటు పేకాట, గుండాటకు పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. ఇక్కడ వేలంపాట చిన్నదైనా లక్షల్లోనే డిమాండ్ ఉంటుంది. అలాగే ఇప్పటికే నిర్వాహకులు కొత్తూరు తాడేపల్లి లో మైదానాన్ని పూర్తిగా చదును చేశారు.

**భవానీపురంలోనూ..**

ఇదంతా ఒక ఎత్తైతే భవానీపురంలోనిది మరోక ఎత్తు. సువిశాలమైన ప్రదేశం కావడంతో టెంట్లను ఇప్పటికే సిద్ధం చేసేసినట్లు సమాచారం. బరులకు, జూదానికి వేలంపాటలు నిర్వహించి లక్షల్లో వసూలు చేసేసారన్న ప్రచారం జరుగుతుంది. మరోవైపు నున్న, రామవరప్పాడు, యనమలకుదురు లో బరులను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కోట్లల్లో చేతులు మారే అవకాశం ఉండడంతో పోలీసులు పూర్తి నిఘా పెట్టి చట్ట వ్యతిరేకంగా నిర్వహించే కోడిపందాలను అడ్డుకోవాలని కోరుతున్నారు స్థానికులు.. అయితే ఏ ఏ బరుల వద్ద కోడిపందాలలో చిన్న బరి, పెద్ద బరులతో పాటు పేకాట, గుండాట చిన్న బజార్ పెద్ద బజార్ ఎవరెవరు ఎంతంతకి దక్కించుకున్నారో రేపటి సంచికలో...

# గిరిజన మైనింగ్ ప్రాంతాల్లో ఆరోగ్య ప్రదాయిని ఆరోగ్య రథాలు

**కోటి రూపాయలతో రెండు ఆరోగ్య రథాల ప్రారంభం**

**కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పేదలకు మెరుగైన వైద్యం**

**రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ ల మంత్రి కొల్లు రవీంద్ర**



**విజయవాడ బ్యూరో, జనవరి 10, మేజర్ న్యూస్ :** మైనింగ్ అధికంగా జరిగే అరకు, పాడేరు ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలందించడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ ల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయం తాడిగడప లో ఆరోగ్య రథం వాహనాలను మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ బస్సులు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. 2017 లో ఏపిఎండీసీ ఆధ్వర్యంలో రూ. 17 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మైనింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఆరోగ్య రథాలను తీసుకువచ్చామన్నారు. ఇప్పటికే ఏపిఎండీసీ ద్వారా ఆరోగ్య సేవలు, విద్యాలయాలు, ఇతర వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పుడు కోటి రూపాయల వ్యయంతో పూర్తి సాంకేతికత కలిగిన రెండు వాహనాలను ప్రజల ముందుకు తీసుకొచ్చామన్నారు. వీటి ద్వారా ఆరోగ్య సేవలతో పాటు హెల్త్ చెకప్, కార్డియో, రక్త పరీక్షలు, ఈసీజీ తదితర సేవలు అందించటం జరుగుతుందన్నారు. 2019-24 మధ్య కాలం లో రాష్ట్రంలో కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ ను నాశనం చేసారన్నారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ కనీసం ప్రజల ఆరోగ్యంపై పెట్టిన దాఖలాలు లేకుండా పోయాయన్నారు. భవిష్యత్తులో ఎక్కడ అవసరం ఉన్నా ఈ సేవలను కొనసాగిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తొలుత ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్ కుమార్ తో కలిసి రెండు ఆరోగ్య రథం వాహనాలను జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. అనంతరం బస్సుల్లో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మరోసారి నిరూపించుకుంది. ఈ వాహనంలో ఒక డాక్టర్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, డ్రైవర్ మరియు ఫార్మసిస్ట్ ఉంటారు, వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు నెలలో 24 రోజుల పాటు ఆయా గ్రామాల్లో ఆరోగ్య సేవలు ప్రజలకు అందిస్తారు.

# పట్టణంలో అభివృద్ధే అజెండాగా ప్రభుత్వ విప్ సౌమ్య పర్యటన





**రహదారులు, తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్యం పై దృష్టి**

**గత ఐదేళ్లలో తీవ్ర అవస్థలను ప్రజలు అనుభవించారు**

**సుమారు కోటి రూపాయలతో పట్టణ అభివృద్ధి**

**అన్ని వార్డుల్లో మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యం**

**అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : తంగిరాల సౌమ్య**

**నందిగామ, జనవరి 10, మేజర్ న్యూస్:** మున్సిపాలిటీకి మహర్దశ పట్టనుంది, ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి మున్సిపాలిటీల నిధులను సొంత ఖర్చులకే వినియోగించుకునే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇకపై మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో వసతుల కల్పనపై దృష్టి సారించనున్నారు.నందిగామ పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసేందుకు ఆరునెలల కాలంలోనే ఒక కోటి 70 లక్షలు మంచినీటి సరఫరాకు, ఒక కోటి 30 లక్షలు రోడ్లకు, కోటి రూపాయలు పారిశుద్ధ్య పనులకు నిధులు కేటాయించడం జరిగిందని ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. శుక్రవారం పలు వార్డుల్లో బీటీ, సీసీ రోడ్లు, ఆర్ సీ సీ డ్రైన్లు, మంచినీటి సరఫరాకు వాల్స్, పైప్ లైన్ల పునరుద్ధరణ వంటి సుమారు పది అభివృద్ధి పనులను జనరల్, 15వ ఆర్థిక సంఘం నిధులతో శంకుస్థాపన కార్యక్రమాలను కూటమి నేతలు, అధికారులతో కలసి చేపట్టారు.ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నందిగామ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తాగునీరు, డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తంగిరాల సౌమ్య మునిసిపల్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. ఏ మున్సిపాలిటీ నిధులను ఆ ప్రాంతంలోనే అభివృద్ధి పనులకు వినియోగించుకునేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, దీంతో నందిగామ మున్సిపాలిటీ మరింతగా ఆర్థిక పరిపుష్టి సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**గన్నవరం, జనవరి 10, మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో.. 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును. ఈ రోజు ఉదయం 8 గంటల నుంచి 11:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్న అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్పోర్ట్ సిటీ, బీబీ గూడెం, గోపరపు గూడెం స్లేట్ స్కూల్, చిక్కవరం ఇండస్ట్రీస్, ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును. కావున గృహ వినియోదారులు, వ్యాపార వినియోగదారులు, వ్యవసాయ వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

## సెయింట్ ఆన్స్ స్కూల్లో సంక్రాంతి వేడుకలు




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ అమలా పుష్పం మాట్లాడుతూ రత్నాల రాశులు పండించిన రైతుల పండుగగా, భారతదేశంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జరుపుకునే ఏకైక పండుగ సిరి సంపదలు ఇంటికి తెచ్చే పండుగ సంక్రాంతి పండుగ అని విద్యార్థులకు వివరించారు. తొలుత చిన్నారులకు భోగిపళ్ళు పోసి ఆశీర్వదించారు, అనంతరం పలువురు చిన్నారులు సంక్రాంతి ముగ్గులు వేసి భోగి మంటలు వేసి కోడి పందాలు తిలకిస్తూ, ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ మోళి థామస్, స్కూల్ అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓపెన్ ఫోరం ద్వారా టౌన్ ప్లానింగ్ సమస్యల పరిష్కరణ

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం నాడు పట్టణ ప్రణాళిక అధికారులు మూడు సర్కిలలో ఓపెన్ ఫోరమ్ ను నిర్వహించారు. ఈ ఫారం లో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన ప్లాన్ ల పై ప్రజల సమస్యలను పరిష్కరించారు. ప్రజలకు ఎల్ఆర్ఎస్, డీపీఎంఎస్ విషయాలపై ప్రజల సందేహాలను తీర్చారు. ఈ ఫోరంలో డిసిపి చంద్రబోస్, ఎసిపి లు రాంబాబు, మోహన్ బాబు, ఇతర టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న వితరణ



**నందిగామ, జనవరి 10, మేజర్ న్యూస్:** వైకుంఠపుర వాసి, సకల శుభాలను కలుగజేసే ఆది దేవుడు,ఉత్తర ద్వార దర్శనమిస్తున్న శ్రీ మహావిష్ణువు స్వామికి ప్రీతి పాత్ర కరమైన ముక్కోటి ఏకాదశి పర్వదినాన నందిగామ గాంధీ సెంటర్లో, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పారేపల్లి సాయిబాబు ఆధ్వర్యంలో, శ్రీమన్నారాయణుని చిత్రపటం ఉంచి పూజ గావించి నివేదనానంతరం 1000 మంది భక్తులకు భారీ ఎత్తున పులిహోర, చక్రపొంగలి,దద్దోజనం ప్రసాదములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి పారేపల్లి సాయిబాబు,పబ్బతి జనార్ధనరావు, సముద్రాల లక్ష్మారావు, దూపకుంట్ల గుప్త,రంగా సూర్య ప్రకాష్ రావు, గోనుగుంట్ల హరి మహంకాళి కోటి,మొరిశెట్టి కృష్ణ చైతన్య,సముద్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పందెం బరులను ధ్వంసం చేసిన చిల్లకల్లు ఎస్సై సూర్య శ్రీనివాస్



**జగ్గయ్యపేట, జనవరి 10, మేజర్ న్యూస్ :** సంక్రాంతి సందర్భంగా మండలంలో చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని షేర్ మహమ్మద్ పేట గ్రామ శివారులో పందెం బరులను ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారం మేరకు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు డి.సి.పి కె ఎం. మహేశ్వర రాజు ఐపిఎస్ పర్యవేక్షణలో నందిగామ ఏసిపి ఎ.బి. జి. తిలక్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు చిల్లకల్లు ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్ వారి సిబ్బంది కలిసి సదరు ప్రాంతాన్ని పరిశీలించి ఓనర్ కు, ఆర్గనైజర్ లకు నోటీసులను ఇవ్వడం జరిగింది.అనంతరం బరులను ట్రాక్టర్ తో దున్నించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో కోడి పందాలు, గుండాట, అసభ్యకర నృత్యాలు, మరే ఇతర జూద క్రీడలు నిర్వహించరాదని, పాల్గొనరాదని, ఇటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొన్న, ప్రోత్సహించిన లేదా నిర్వహించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్లును విడుదల చేసిన సామ్‌సంగ్

**విజయవాడ మేజర్ న్యూస్ :** నిద్ర దశల ప్రకారం ఉష్ణోగ్రతను సర్దుబాటు చేయడం ద్వారా రాత్రంతా ఆహ్లాదకరమైన నిద్రను ప్రోత్సహించడానికి సామ్‌సంగ్ 'గుడ్ స్లీప్' మోడ్‌ను ప్రవేశపెట్టింది. వినియోగదారులు తమ ఎయిర్ కండిషనర్‌లను వారి గెలాక్సీ వాచ్ సిరీస్‌తో కనెక్ట్ చేయడానికి, వారు నిద్రలోకి జారుకున్నప్పుడు 'గుడ్ స్లీప్' స్వయంచాలకంగా పనిచేయటానికి వీలు కల్పిస్తుంది. 'గుడ్ స్లీప్'ను ప్రోత్సహించడానికి, సామ్‌సంగ్ ఒక ప్రత్యేక ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా వినియోగదారులు ఎంపిక చేసిన సామ్‌సంగ్ విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్‌లను కొనుగోలు చేయడంపై 42 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు.

## కాలిఫోర్నియా బాదం వంటకంతో పంట కోత కాలాన్ని వేడుక జరుపుకోండి



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన బాదం అయిన కాలిఫోర్నియా బాదంలను చేర్చడం ద్వారా పండుగ విందుకు ఆరోగ్యకరమైన మలుపును అందిద్దాం. డ్రై ఫ్రూట్స్ రాజుగా, కాలిఫోర్నియా బాదంలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఆహార ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు సహా 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పంట కాలంలో తయారుచేసే పొంగల్‌లో బాదం వంటి పోషకమైన పదార్థాలు ఉండేలా చూసుకుంటానని ప్రముఖ నటి శ్రియ శరణ్ పేర్కొన్నారు.

## తొలిసారి స్టడీ సర్కిల్ నిర్మాణం చేయాలనే నిర్ణయం అభినందనీయం

**బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు పివిఎల్ఎన్ రాజు**

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కొరకు రాష్ట్ర రాజధాని అమరావతిలో ఐదు ఎకరాలలో బీసీ స్టడీ సర్కిల్ ను నిర్మిస్తామని నిర్ణయం తీసుకోవడం ముదావహమని ఆంధ్రప్రదేశ్లోని బీసీ విద్యార్థులకు ఈ స్టడీ సర్కిల్ ఎంతో ఉపయోగపడుతుందని బీసీ ఐక్య వేదిక నగర అధ్యక్షులు, అఖిల భారతీయ కోలీ సమాజ్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పివిఎల్ఎన్ రాజు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఇన్వర్టర్ లో అందుబాటులోకి తెచ్చినందుకు సీసీ కెమెరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నందుకు బీసీ గురుకులాలను పూర్తి చేస్తున్నందుకు సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన శిక్షణ అందిస్తున్నందుకు, తొలి తరం స్వాతంత్ర సమరయోధులు ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## నూతన పంపు ఏర్పాటుకు భూమి పూజ



**పామర్రు జనవరి 10 మేజర్ న్యూస్ :** తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామంలో మండల పరిషత్ నిధులతో నూతన డబ్బా పంపు నిర్మాణం కోసం శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. మండల పరిషత్ నిధులు రూ.1.25 లక్షల వ్యయంతో పల్లపు కాలువ సమీపంలో కనగాల వెంకట సత్యనారాయణ పొలం వద్ద ఈ పంపును ఏర్పాటు చేయనున్నారు. గ్రామ సర్పంచ్ మూడే శివ శంకరరావు భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభింపజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కనగాల వెంకట సత్యనారాయణ (చంటి), నిమ్మగడ్డ సీతా రాంబాబు, బీరం విజయ రామ్మోహనరావు,గ్రామ పంచాయతీ సభ్యులు మసి ముక్కు శ్రీనివాసరావు, సూర్యదేవర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, చిన్న అరుణాచలం క్షేత్రం



అరుణాచల శివ
(చిన్న అరుణాచల క్షేత్రము)



శ్రీ అరుణాచల శివ, ఆపీతకుచలాంబ దేవి



భారీ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం



శివ పార్వతీ దేవి విగ్రహాలు

**తమిళనాడులో వున్న అరుణాచల క్షేత్రము నమూనాతో అన్ని విశిష్టతలు, విశేషాలు, దర్శనాలు, గిరి ప్రదక్షిణ, మోక్ష ద్వారం కూడా ఇక్కడ వుండటం విశేషం**

**స్పటిక లింగం, శ్రీపాద లింగం, మరకత లింగం తదితర 1008 శివలింగాలు కొలువై వుండటం విశేషం**

**ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు**

**అమరావతి మేజర్ న్యూస్ :** ఆయన ఒక ప్రభుత్వోద్యోగి ధ్యానంలో వుండగా ఆయన ఒక పుట్టను దర్శించారని, వెదికి చూడగా తమ పూర్వీకుల స్థలంలో ఆ పుట్ట వుందని గుర్తించారు. అంతేకాదు పామును కూడా చూశారు. దీనితో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఆయనే శ్రీ నాగ శివ స్వామి..ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం వ్యవస్థాపకులు కేవలం ఎనిమిది వేల రూపాయలతో ప్రారంభమైన ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం నిర్మాణం దాదాపు మూడు కోట్ల రూపాయల వ్యయంతో కేవలం మూడేళ్ళ క్రితం పూర్తి చేశారు.తమిళనాడులో వున్న అరుణాచల క్షేత్రము నమూనాతో అన్ని విశిష్టతలు, విశేషాలు, దర్శనాలు, గిరి ప్రదక్షిణ, మోక్ష ద్వారం కూడా ఇక్కడ వుండటం విశేషం. అని ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు అన్నారు.భద్రాచలం (నరసాపురం) అరుణాచలం స్మారణాన్ ముక్తి అరుణాచలం అని కేవలం స్మరిస్తే ముక్తి లభిస్తుందని నానుడి. అంతదూరం. వెళ్ళలేని వృద్ధులు, నిరుపేదలు తెలంగాణాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలం, నరసాపురం గ్రామంలో వున్నది. భద్రాచలం నుండి జటాయువు సీతమ్మ ఆరవేసుకున్న నార చీరలు, పర్ణశాల వెళ్ళే మార్గంలో కేవలం 15 కి.మీ. దూరంలో ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం వున్నది. దీనిని చిన్న అరుణాచలం అని పిలుస్తారు. ఇక్కడ అన్నీ విషయాలు అరుణాచలం మాదిరిగా వుంటాయి. స్ఫటిక లింగం, శ్రీపాద లింగం, మరకత లింగం తదితర 1008 శివలింగాలు కొలువై వుండటం విశేషం. 42 అడుగుల గ్రానైట్ ధ్వజస్తంభం వుంటుంది. భారీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శివ పార్వతుల విగ్రహాలు ఉన్నాయి. అరుణాచలం లో పౌర్ణమి రోజున కృత్తికా దీపం వెలిగిస్తారు. అదేమాదిరిగా దాదాపు, 42 అడుగుల ఎత్తులో కృత్తిక దీపం ప్రజ్వలన చేయడం విశేషం. ఇక్కడ "నిత్యాన్నదానం" కూడా వున్నది. దాదాపు ఐదేళ్ళ కాలంలో ఈ క్షేత్రం నిర్మించడం విశేషం..ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చరిత్ర,.ఒక కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్న శివ నాగరాజు పరమ శివ భక్తుడు. ఆయన ధ్యానంలో వుండగా ఒక పుట్టను కనుగొన్నాడు. ఆయన ఆ పుట్ట ఎక్కడ వుందో చూడాలని అంతటా వెదికాడు. చివరకు తన శోధన ఫలించింది. ఆ పుట్ట తన పూర్వీకుల స్థలంలో వున్నట్లు గుర్తించాడు. అంతే కాదు పాము కూడా తాను దర్శించడం జరిగింది. ఇంతే ఆలయం నిర్మించాలని సంకల్పించారు. ఆలయ నిర్మాణానికి కావలసిన స్థలం ఆయన తండ్రి సత్యనారాయణ సమకూర్చారు. కేవలం ఎనిమిది వేల రూపాయలతో ప్రారంభమైన ఈ క్షేత్ర నిర్మాణం దాదాపు మూడు కోట్ల రూపాయలతో దాదాపు మూడున్నర సంవత్సరాలలో పూర్తి చేయడం విశేషం. ఈ క్షేత్రంలో 1008 శివలింగాలు వున్నాయి. స్వయంగా భక్తులు వీటికి అభిషేకం చేసుకుంటారు. భారీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం పర్ణశాలకు వెళ్ళే దారిలో వుండటం వల్ల భక్తులు ఈ దేవాలయానికి ఆకర్షితులు అవుతారు. ఇక్కడ దర్శనం చేసుకున్న భక్తులు వారి పూర్వ జన్మ సుకృతం వుంటే తమిళనాడులో వున్న అరుణాచల క్షేత్రము దర్శిస్తారు. ఈ ఆలయాన్ని ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు కుటుంబ సభ్యులు దర్శించారు. ఇక్కడ వేద పాఠశాల కూడా వున్నది. కార్తీక మాసం, శివరాత్రి పర్వదినం రోజులలో భక్తులు భారీగా అరుణాచలేశ్వర స్వామి, అపీత కుచలాంబ దేవిని, శివ పరివారాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీ నాగ శివ స్వామితో తమకు వ్యక్తిగత పరిచయం వుందని, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో జరుగుతున్న "నిత్యాన్నదానం" నిమిత్తం తమ కుటుంబ సభ్యుల పేర్లతో అన్నదానానికి విరాళం అందజేసినట్లు ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ క్షేత్రాన్ని తప్పనిసరిగా దర్శించాలని ఆయన భక్తులను కోరుతున్నారు. ఈ క్షేత్రం దర్శించిన తరువాత రెండు పర్యాయాలు తమిళనాడులో వున్న అరుణాచల క్షేత్రము దర్శించామని, తన 69 ఏళ్ళ వయస్సులో కూడా గిరి ప్రదక్షిణ చేశానని చెప్పారు.

**స్వామి వారి మహిమలు వెల్లడించిన ఆలయ వ్యవస్థాపకులు నాగ శివ స్వామి**



ఆలయ నిర్మాణం ప్రారంభించక ముందు తాను ధ్యానంలో ఒక పుట్టను కనుగొన్న విషయం, అంతటా పుట్టకోసం శోధించగా పుట్టతో పాటు పామును చూసిన విషయం గురించి వివరించారు. గర్భగుడిలోకి పాము వస్తుందని ఒక్కోసారి లింగాన్ని చుట్టుకొని వుంటుందని, సోమవారం తలుపులు తీసే సమయంలో బయటకు వెళ్తుందని తాను స్వయంగా పామును చూస్తానని, ఇక్కడ పడుకున్న భక్తులు గర్భగుడిలోకి వెళ్తున్న పామును చూశామని చెబుతారన్నారు.ఇక్కడ దర్శించుకున్న భక్తులకు నాగదోషాలు నివారించబడతాయని నాగ శివ స్వామి తెలిపారు. ఇక్కడ జరుగుతున్న పూజలు కార్యక్రమాలు అన్నీ అరుణాచల క్షేత్రము మాదిరిగా వుంటాయని చెప్పారు. కేవలం ఎనిమిది వేల రూపాయలతో ప్రారంభమైన ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం నిర్మాణం భక్తుల సహకారంతో దాదాపు మూడు కోట్ల వ్యయంతో పూర్తి చేశామని వెల్లడించారు.

**మూడు రోజులు స్వామి వారి బ్రహ్మోత్సవాలు**

ఈనెల 11, 12, 13 తేదీలలో ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపకలు నాగ శివ స్వామి ప్రకటించారు. మొదటి రోజున స్వామి వారికి నంది వాహన సేవ, రెండవ రోజు హంస వాహన సేవ 3వ రోజున ఉత్తర ద్వార దర్శనం,శివ ముక్కోటి రోజున విశేష అభిషేకం జరుగుతుందని ఆయన వివరించారు. భక్తులు అందరూ తప్పనిసరిగా ఈ ఆలయం దర్శించవలసిందిగా శివ స్వామి భక్తులకు విజ్ఞప్తి చేశారు.



## అసిసీ్స పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

**పామర్రు జనవరి 10 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పామర్రు లోని అసిస్సి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పతంగులు ఎగురవేస్తూ ఉల్లాసంగా గడిపారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి సరదాగా పతంగులను ఎగురవేస్తూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. రోజూ తరగతి గదులలో ఉంటున్న విద్యార్థులు శుక్రవారం క్రీడామైదానంలో పతంగులు ఎగరవేస్తూ ఉత్సాహంగా గడిపారు. అలాగే బాలికలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేయడంలోనూ, వాటికి రంగులు అద్దడంలోనూ తమ ప్రతిభను కనబరిచేందుకు పోటీపడటం విశేషం. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రోజ్ థామస్, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ వల్సా సెబాస్టియన్, ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సంక్రాంతి సంబరాలను వేడుకగా నిర్వహించారు.



# ఎస్‌విఎల్‌లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక ఎస్ వి ఎల్ విద్యా సంస్థల ఆవరణలో శుక్రవారం జరిగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా వైభవంగా జరిగాయి. పట్టు పరికిణిలు ధరించిన పదహారణాల తెలుగింటి ఆడపిల్లల సందడి మధ్య పందానికి కాలుదువ్వే కోడిపుంజులు, పొట్టేళ్ళు, భోగి మంటలతో ముందస్తు సంక్రాంతి కోలాహలంగా జరిగింది. విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ముందుగా ఆత్మీయ అతిథి, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ను వారి ఇంటి వద్ద నుంచి సంప్రదాయబద్ధంగా ఎడ్లబండి పై డప్పు వాయిద్యాలతో తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా విద్యాసంస్థ ఆవరణలో ఏర్పాటు చేసిన పొట్టేలు పోటీలు, కోడి పందాలు ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థినిలు చక్కని కర్రసాము ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీల విజేతలకు వెంకట్రామ్ చేతులమీదుగా బహుమతులు అందచేశారు. అనంతరం వెంకట్రామ్ భోగి మంటను వెలిగించగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవీ, సీనియర్ నాయకులు పర్చూరి దుర్గాప్రసాద్, ఎస్.వీ.ఎల్. క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ వసుమతి, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# వైకుంఠ ఏకాదశికి పోటెత్తిన భక్తులు





## తెల్లవారుజాము నుండి భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

### బచ్చుపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం, భద్రాద్రి శ్రీ రాముల వారి దేవాలయంలో ఘనంగా ఉత్సవాల నిర్వహణ

**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము మూడు గంటల నుండి వివిధ దేవాలయాల్లో భక్తులు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి విచ్చేసి స్వామి వారి దర్శనం చేసుకొని పునీతులయ్యారు. నేటి నుండి సంక్రాంతి సెలవులు కూడా కావడం వల్ల, భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారి ఉత్తర ద్వార దర్శనం నిర్వహించుకున్నారు. స్థానిక బచ్చుపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ఈవో సమ్మెట ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో, భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు అతి త్వరగా దర్శనం జరిగేలాగా ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తేవి రవికాంత్, ఆలయ ప్రధాన అర్చకులు శశికాంత్ భక్తులకు స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్ లో ఉన్న శ్రీ భద్రాద్రి రామాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శన నిమిత్తం భక్తులు తెల్లవారుజాము మూడు గంటల నుండి, క్యూలైన్లో వేచి ఉన్నారు. ఆలయ ఈవో వై శిరీష, సిబ్బంది భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు నిర్వహించారు. పోలీస్ బందోబస్తు కూడా నిర్వహించడం జరిగింది. దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. నగరంలోని దేవాలయాలు గోవిందా, గోవిందా అనే నామస్మరణతో మార్మోగాయి. భద్రాద్రి రామాలయంలో కూడా భక్తులకు దర్శన ఏర్పాట్లలో ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో పర్యవేక్షించారు. దేవాలయాల్లో క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నగరంలోని వివిధ దేవాలయాల్లో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

# ముక్కోటి సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు




**పామర్రు జనవరి 10 మేజర్ న్యూస్ :** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పామర్రు మండలంలోని పలు గ్రామాల్లో గల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామాల్లో ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తెల్లవారుజాము నుండే దేవాలయాల వద్ద బార్లు తీరారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల్లో ఉదయం ఉత్తర ద్వార దర్శనం అనంతరం స్వామివార్ల గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా దేవాలయాల వద్ద ప్రత్యేకంగా ప్రసాదాలను ఏర్పాటు చేసి భక్తులకు వితరణ చేశారు.

# వైష్ణవ ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని దివిసీమలోని వైష్ణవాలయాల వద్ద భక్తులు, బారులు తీరారు. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి లేక ముక్కోటి ఏకాదశి అంటారు. ఆ రోజున వైకుంఠ వాకిళ్లు తెలుసుకొని ఉంటాయని వైష్ణవాలయాల్లో గల ఉత్తర ద్వారం వద్ద భక్తులు వేకువజాము నుండే భగవంతుని దర్శనం కోసం వేచి ఉంటారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మహా విష్ణువు ఈరోజున గరుడ వాహనారుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తారు దీనికే ముక్కోటి ఏకాదశి అని పేరు వచ్చినది అని అంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమైన పవిత్రతను సంతరించుకోవడం వలన దీనిని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా పండితులు చెబుతారు. వైష్ణవాలయాల్లో వేకువ జామునే స్వామివార్ల ను ప్రత్యేకంగా అలంకరించి పూజిస్తారు. ముక్కోటి ఏకాదశి రోజున చేసే విష్ణు పూజ గీత పారాయణం గోవింద నామ స్మరణం పురాణ శ్రవణం మోక్ష ప్రాప్తి కలిగిస్తాయి ఇవి ఏమి చేయడం వీలు కాని వారు ఓం నమో నారాయణాయ అనే మంత్రాన్ని అని జపించడం ద్వారా వీరు అనుకున్న కార్యాలు దిగ్విజయంగా నెరవేరుతాయి అని నమ్మకం. ఏకాదశి రోజు విష్ణు, వెంకటేశ్వర స్వామి వారి దేవాలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. గీతా మందిరం లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయాలలో భక్తులకు స్వామి వార్లు ఉత్తర ద్వారా దర్శనం అందించారు భక్తులు ఓం నమో నారాయణాయ అని నామంతో దేవస్థాన ప్రాంగణాలు దద్దరిల్లాయి లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయంలో బృందావనం వేణుగోపాల స్వామి స్వామివార్లకు ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు ఈ సందర్భంగా భక్తులకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పోతురాజు భాస్కరరావు దంపతులు తీర్థప్రసాదాలను అందజేయగా, గీత మందిరంలో మందిర కమిటీ నిర్వాహకులు ఎర్రం శెట్టి శ్రీహరి బాబు దంపతులు ప్రసాదాలను అందించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

మండల పరిధిలోని పులిగడ్డ వెంకటేశ్వర సంతాన వెంకటేశ్వర స్వామి, వేకనూరు కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. తిరుపతి ఘటనను దృష్టిలో ఉంచుకొని పులిగడ్డ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అవనిగడ్డ ఎస్సై శ్రీనివాస్ పర్యవేక్షణలో పోలీసు బృందం క్యూ లైన్ ల వద్ద పటిష్ట చర్యలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త మండలి భవనారాయణ, వెంకటేశ్వరరావులు ఏర్పాట్లు పర్యవేక్షించి ప్రసాదాలను పంపిణీ చేశారు.

**గరుడ వాహనంపై గ్రామోత్సవం**

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పురవీధులలో భక్తులకు దర్శనమిస్తూ సాగిన గ్రామోత్సవం లో దారి పొడవునా భక్తులు స్వామివారికి కానుకలు సమర్పించి కొబ్బరికాయలుకొట్టి, కర్పూర హారతులు ఇచ్చారు. అనువంశిక ధర్మకర్తలు పోతురాజు భాస్కరరావు సురేష్ బాబు తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు.




## వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

**గుడివాడ, మేజర్ న్యూస్:** వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు గుడివాడ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుండే వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. తెల్లవారుజాము 4గంటలకు స్వామి వారి ఉత్తర ద్వారా దర్శనాన్ని ధర్మకర్తల కమిటీ మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణారావు ప్రారంభించారు. అప్పటికే స్వామివారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. భారీ సంఖ్యలో వస్తున్న భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



**కంచికచర్ల జనవరి 10 మేజర్ న్యూస్ :** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వార దర్శనానికే అంతా ప్రాధాన్యత ఇస్తారు. స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్తర ద్వారం కలిగి ఉండటం విశిష్టత సంతరించుకుంది. తెల్లవారుజామునండి భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన గరుడ వాహనంపై మహా విష్ణు అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ రోజున ముక్కోటి దేవతలందరూ విష్ణుమూర్తిని దర్శించుకున్నారని ప్రతీక. అందుకనే ఈ రోజుకి ముక్కోటి ఏకాదశి అన్న పేరు సంతలించుకుందని పురాణాలు చెబుతున్నాయి. ఈనాడే మధుకైటభులనే రాక్షసులకి శాపవిమోచనం కలిగించి, వారికి తన వైకుంఠ ద్వారం వద్ద విష్ణు భగవానుడు దర్శనమిచ్చి అనుగ్రహించాడు. తమలాగే ఈరోజున ఎవరైతే వైకుంఠ ద్వారాన్ని పోలిన ఉత్తరద్వారాన్ని నిర్మించి స్వామిని దర్శించుకుంటారో, వారికి మోక్షాన్ని ప్రసాదించమని వారు వేడుకుంటారు. అప్పటినుంచీ ఉత్తర ద్వారం గుండా శ్రీవారిని దర్శించుకునే ఆచారం మొదలైంది. ఈ ఏకాదశినాడే వైకుంఠంలోని విష్ణుమూర్తివారి ఆంతరంగిక ద్వారాలు తెరుచుకున్నాయి కాబట్టి దీనికి 'వైకుంఠ ఏకాదశి' అన్న పేరు స్థిరపడింది. దేవాలయంలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు స్థానిక పోలీసు వారు కట్టుదిట్టమైన చర్యలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భద్రత ఏర్పాట్లు చేశారు. భక్తులు పోలీసు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## రీ సర్వే పై అవగాహన కలిగి ఉండాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బొర్రపోతుపాలెం గ్రామ పంచాయతీ లో కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు కుంచె దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్ రాజబాబు,నారాయణల అధ్యక్షతన రీ-సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. శుక్రవారం ఈ కార్యక్రమంలో గోపు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రీసర్వే పై అవగాహన కలిగి ఉండాలని, కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని పైలట్ ప్రాజెక్ట్ కింద మచిలీపట్టణం మండలంలోని బొర్రపోతుపాలెం పంచాయతీని ఎంచుకోవడం జరిగిందన్నారు. ఈ సదస్సు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పొలం విస్తీర్ణంలో ఎక్కువ తక్కువ సమస్యలు ఉన్న యెడల సరి చేసికొనుటకు రీ -సర్వే బాగా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సంబంధిత అధికారులకు పొలం పత్రాలను జతపరిచి పొలం యజమానులు సవరణలు చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా రీ-సర్వే జరిగేటప్పుడు రైతులందరూ అందుబాటులో ఉండాలని అన్నారు. ఇది రైతులకు ఎంతో ఉపయుక్తమైన కార్యక్రమం అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ గట్టే సుశీల, కొక్కు రామాంజనేయులు,కూటమి నాయకులు,రైతులు, పాల్గొన్నారు.



## కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలోని ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని పిఆర్టియు ఎన్టీఆర్, కృష్ణజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నవాబ్ జాని, రాఘవ రాజు, పెద్దిబోయిన శ్రీనివాసరావు, మనోహర్ లు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సి ఈ ఓ ఆనంద్ బాబుని కలిసి ఉమ్మడి కృష్ణ జిల్లాలో ఉపాధ్యాయుల వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల పీఎఫ్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఇప్పటికే పెండింగ్లో ఉన్న 72 కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని, పిఎఫ్ స్లిప్పులను ఇప్పటికే కొన్ని జిల్లాలలో ఆన్లైన్లో ఉంచారని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పిఎఫ్ కూడా కచ్చితంగా ఈ నెల చివరి నాటికి ఆన్లైన్లో ఉంచాలని కోరారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పీ ఎఫ్ పార్ట్ పేమెంట్, ఫైనల్ పేమెంట్, డెత్ క్లెయిమ్స్, పీఎఫ్ సంబంధించిన 32అభ్యర్థనలను వారి దృష్టికి తీసుకుని వెళ్ళగా వారు పరిష్కరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ రమేష్ బాబు, బి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



**కృత్తివెన్ను జనవరి 10 మేజర్ న్యూస్ :** పాడి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సీతనపల్లి పంచాయతీ సంఘముడి గ్రామంలో ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన గోకుల షెడ్డను ప్రారంభించారు. పాడి రైతులు తమ పశువుల కోసం పూరిపాకలు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లబుచ్చే వారిని వాటి ద్వారా కొన్నిసార్లు ప్రమాదాలు ఏర్పడుతున్నాయని దాంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని గ్రహించిన ప్రభుత్వం ఐరన్ షెడ్ వేసుకునేందుకు నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకుని కుటుంబాలను ఆర్థికంగా బలపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఒడుగు తులసి రావు, ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య, కోమల్లపూడి నీటి సంఘం అధ్యక్షుడు కూనసాని శ్రీనివాసరావు, నాయకులు చేకూరి వెంకట్రావు, నడకుదుటి ఆంజనేయులు, మాటూరి బసవేశ్వర రావు, నాగిడి చెన్నకేశవరావు, యాదమ రెడ్డి కొండ, మాట్లం సర్పంచ్ పాండు, చేబ్రోలు న్యూటన్ రాజు, తిరుమని ఏసు, అధికారి శ్రీనివాస్, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాధరపురంలోని షాదీఖానా, బరియల్ గ్రౌండ్ పరిశీలన

### అభివృద్ధి చేసేందుకు పరిశీలన : అబ్దుల్ అజీజ్, వక్ఫ్ బోర్డు చైర్మన్



**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలోని విద్యాధరపురంలో గల షాది ఖానా, బరియల్ గ్రౌండ్ ను ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, వక్ఫ్ బోర్డ్ సీఈవో అబ్దుల్ ఖాదిర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మాట్లాడుతూ విద్యాధరా ప్రాంతంలో గల ఈ ప్రాంతాన్ని అభివృధి చేసేందుకు గల సాధ్య, అసాధ్యాల ను పరిశీలించా మన్నారు. విద్యాధరపురంలోని ఎన్టీఎస్ నెం.128 లో గల 6.90 ఎకరాల, 3.00 సెంట్స్ లో గల భూమిని ముస్లిమ్స్ స్మశాన వాటిక కు కేటాయించి ఉందన్నారు.. మిగతా భూమి 3 ఎకరాల 90 సెంట్స్ భూమి ని అభివృధి కోసం వినియోగించాలని గెజిట్లో నమోదు చేయబడిందన్నారు.. ఈ స్థలాన్ని అభివృధి పరిచే విషయంలో తగు నిర్ణయాన్ని తీసుకోవడమే కాకుండా త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

# డీసిల్టింగ్ ప్రక్రియను మొదలు పెట్టండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** డీసిల్టింగ్ ప్రక్రియను వెంటనే మొదలు పెట్టమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన పర్యటనలో భాగంగా, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఈట్ స్ట్రీట్, ఏలూరు రోడ్డు, మాచవరం, ఈ ఎస్ ఐ హాస్పిటల్, క్రీస్తురాజుపురం, ఏ ఎస్ రామ రావురోడ్డు, హరిజన వాడ, లోయల కాలేజీ రోడ్డు, మధు చౌక్ ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాలు పడినప్పుడు వర్షపు నీటి నిలువలు రోడ్డు మీద నిలిచి ఉండే ప్రదేశాలను 72 ఉన్నాయని అధికారులు గుర్తించగా వాటిని నిరంతరం డీసిల్టింగ్ చేసుకుంటూ భారీ వర్షాలు పడినా, వర్షపు నీటి నిలువలు రోడ్డు మీద నిలవకుండా ఉండే టందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రధాన ఔట్ఫాల్ డ్రైన్లో కలిసే, డ్రాయింలను ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షిస్తూ డిసిల్టింగ్ చేసుకుంటూ ఉండాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఏలూరు రోడ్, మాచవరం ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ పొంగటం గమనించి వెంటనే చర్యలు తీసుకొని ఆ సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్రీస్తు రాజపురం, హరిజనవాడలో ఎప్పటినుండో నిలిచి ఉన్న పాత ద్విచక్ర, 4 చక్ర వాహనాలను పోలీస్ వారి సమన్వయంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్లో పాడైపోయిన కలవర్ట్ ను గమనించి వెంటనే మరమతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు, మధు చౌక్ సెంటర్ వద్ద గుహల ముందు డ్రైన్ నిర్మాణంను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇంజనీరింగ్మరి, టౌన్ ప్లానింగ్ సమన్వయంతో రోడ్లు పైనున్న నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెంటింగ్ ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్యకుమారి పాల్గొన్నారు.

## కిషోర్ వికాసంలో భాగంగా విద్యార్థులకు అవగాహన



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని చల్లపల్లి మండలం రామానగరం చల్లపల్లి పబ్లిక్ స్కూల్ నాగార్జున పబ్లిక్ స్కూల్ శ్రీ చైతన్య స్కూల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు అంగన్వాడి సచివాలయ ఎన్జీవో నాయకులు ఏఎన్ఎం లతో పాటు తదితరులు కమిటీలో సభ్యులుగా ఉండి కిషోర్ బాలికల అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కిషోర్ బాలికలు అవగాహన కలిగి ఉండాలని అన్ని చట్టాలు తెలిసి ఉండాలి అన్నారు ఎవరైనా సమాచారం అందించాలని తెలిపారు బాలురు చెడు అలవాటులకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలు కు అలవాటు పడి బంగారు భవిష్యత్తు పాడు చేసుకోకూడదని తెలిపారు గంజాయి మత్తు పదార్థాలు ఎక్కడైనా అమ్మిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియపరచాలని చెప్పారు అనంతరం పలు విషయాలు తెలియజేస్తూ బాలురు బాలికలలో అవగాహన కల్పించడంతో పాటు మైనర్ బాలికల వివాహాలపై అవగాహన కల్పించారు ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్న ఎడల వెంటనే స్థానిక అంగన్వాడీ కార్యకర్తలకు తెలియపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి సరిత సుజాత లీలావతి లతో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. తెలియని వ్యక్తులు తిను పదార్థాలు ఇచ్చిన తీసుకోకూడదని గుర్తు తెలియని వ్యక్తుల వెంట ఎక్కడికి వెళ్లరాదని అలాంటివారు ఎదురైతే వెంటనే సంబంధిత శాఖ అధికారులకు స్థానిక సచివాలయ అధికారులకు అంగన్వాడీ కార్యకర్తలకు సమాచారం అందించాలని సూచించారు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించడంతోపాటు పాఠశాలలో ఎవరైనా బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన బాధపడే విధముగా వ్యవహరించిన వెంటనే 181 కు



## తెలంగాణ మద్యం బాటిల్స్ పట్టివేత

**కంచికచర్ల జనవరి 10 మేజర్ న్యూస్ :** అక్రమ మద్యం అమ్మకాలు జరిపితే సహించేది లేదని ఎక్సైజ్ సీఐ అశ్రఫున్నిసా బేగం ఘాటుగా హెచ్చ రించారు. కంచికచర్ల మండలం మొగులూరు గ్రామంలో తెలంగాణ నుంచి అనధికారకం గా మద్యము తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్న షేక్ మహమ్మద్ రసూల్ అనే వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతని దగ్గర నుండి 481మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనధికారికంగా మద్యం విక్రయాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

## ఇళ్ళ నిర్మాణంకు రూ.4లక్షలు మంజూరు చేయాలి



**గన్నవరం, జనవరి 10, మేజర్ న్యూస్ :** అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వారు ఇళ్ళు నిర్మాణం కు 4 లక్షల రూపాయలు మంజూరు చేయాలని, 50 సంవత్సరాల నిండిన వారికి పెన్షన్ లు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సీ.హెచ్ కోటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గన్నవరం పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కొండా వీరాస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం గన్నవరం ఏరియా కార్యదర్శి తిరివీది సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం గన్నవరం ఏరియా నాయకులు మన్నెం గోపాలకృష్ణ తదితరులు నాయకత్వం లో నిరుపేదలతో భారీ ర్యాలీ నిర్వహించారు తొలుత అమరజీవి కామ్రేడ్ చింతపల్లి పాపారావు స్మారక భవనం (సీపీఐ కార్యాలయం) నుండి జాతీయ రహదారిపై ర్యాలీగా గాంధీ బొమ్మ సెంటర్, మూడు బొమ్మలు మీదుగా మండలం రెవెన్యూ కార్యాలయం వరకు చేరుకున్న ర్యాలీని ఉద్దేశించి కామ్రేడ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఎన్నికల్లో చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు పట్టణాల్లో వారికి 2 సెంట్లు, గ్రామాల్లో వారికి 3 సెంట్లు స్థలాలు మంజూరు చేసి వారికి ఇళ్ళ నిర్మాణం కు 4 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కొండా వీరాస్వామి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తమకు అనుకూలంగా ఉన్న వారికి పెన్షన్, ఇళ్ళ స్థలాలు మంజూరు చేసింది అని ఆరోపించారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయకుండా వారి పార్టీకి కొమ్ము కాసిన వారికి మాత్రమే మంజూరు చేసిందని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం గన్నవరం ఏరియా కార్యదర్శి తిరివీది సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కటేవరపు విజయ్ రావు, తిరివీది జాన్ సుబ్బారావు, గౌరీ శంకరరావు, తిరివీది రంగారావు, మన్నెం గోవర్ధన్, మాదవరపు నాగేశ్వరరావు, బొర్రా సుబ్బారావు, మన్నెం వెంకటేశ్వరమ్మ తదితరులు నాయకత్వం వహించారు.

# ఉత్తర ద్వారం గుండా సీతారామ స్వామిని దర్శించుకున్న ఎస్.ఎస్.ఆర్.దంపతులు



## ఆధ్యాత్మిక సేవకులు ఎస్ ఎస్ ఆర్ ఆంజనేయులు జానకి లక్ష్మి దంపతులకు వేద పండితుల ఆశీర్వచనం



**అమరావతి మేజర్ న్యూస్ :** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా హైదరాబాదు నగరంలోని నిజాంపేట్ లో వేంచేసియున్న దాదాపు ఆరు వందల సంవత్సరాల ప్రాచీన శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దేవాలయం లో వేద పండితులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి విశేషమైన అలంకరణ చేశారు. భక్తులు బారులు తీరి విఘ్నేశ్వర స్వామిని, శ్రీ ఆంజనేయ స్వామిని, దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు ఏకాహం నిర్వహిస్తున్నారు.. ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు గర్భ గుడిలో శ్రీ సీతారామ స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బదరీ నారాయణాచార్యులు, పలువురు వేద పండితులు ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు, జానకీ లక్ష్మి దంపతులకు వేద ఆశీర్వచనం అందించారు. వీరికి పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు మాట్లాడుతూ తమ పూర్వ జన్మ సుకృతం కారణంగానే మూడు కోట్ల దేవతలు కొలువై శ్రీ మహావిష్ణువును దర్శించుకుంటున్నారని శ్రీ సీతా లక్ష్మణ రామచంద్ర స్వామిని నేడు తాము దర్శించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. నరసింహచార్యులు, వెంకట రమణా చార్యులు, పలువురు పండితులు తమ దంపతులకు వేద ఆశీర్వచనం అందించడం స్వామి వారు తమకు ఇచ్చిన వరంగా భావిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. వెంకట రమణ, యశోధర్, నరసింహ తదితరులతో పాటు పలువురు పండితులు పాల్గొన్నారు.

# అయ్యంకి సి.పి.డబ్ల్యూ.ఎస్ స్కీముకుసీఈవో ప్రశంసలు



**మొవ్వ (జనవరి 10) మేజర్ న్యూస్:** గ్రామాలలో రక్షిత మంచినీటి పథకాల ద్వారా పరిశుభ్రమైన తాగునీరు అందుతోందా? లేదా? అనే అంశాలపై జరుగుతున్న పరిశీలనలో భాగంగాశుక్రవారంకృష్ణాజిల్లా సీఈవో కన్నమ నాయుడు పామర్రు నియోజకవర్గంలోని అయ్యంకి గ్రామంలో ఏర్పాటు చేసిన 1600 కే.ఎం. పరిమాణంగలసిపిడబ్ల్యూఎస్ స్కీమునుపరిశీలించి సంతృప్తి రక్తం పరిచారు. తోట్లవల్లూరు మండలంఐలూరు కృష్ణానది లోని జలాల నుంచి నియోజకవర్గంలోని మొవ్వ, పామర్రు,పెదపారుపూడి మండలాలలోని 44గ్రామాలకు విడుదలవుతున్న తాగునీటి సంపు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. దీని నిర్వహణపై సంబంధిత అధికారుల నుంచి, గ్రామ పంచాయతీ నుంచి పూర్తి వివరాలు సేకరించిసంపును ప్రాంగణాన్ని సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించి పలు సూచనలను అందజేశారు. గ్రామ సర్పంచ్ నాగనబోయిన సునీల్ కుమార్, జడ్పిటిసిలు రాజులపాటి పార్వతి, కూనపరెడ్డి స్వరూప, ఎంపీపీలు కొండేటి ఇందిర, దాసరి అశోక్ కుమార్, ఎంపీడీవోలు జే విమాదేవి, కే. జ్యోతి, సీతామహాలక్ష్మి లు,జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, ఆర్డబ్ల్యూఎస్ డీజి సత్యనారాయణ, ఏఈలు కె ఎస్ ఆర్ కె ప్రసాద్, డివి రత్నారావు, ఈ.ఓ.పి.ఆర్. డి ఎం ఎస్ కే పరమాత్మ, అయ్యంకి కార్యదర్శి ప్రభు కుమార్ లతోపాటు గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 1,77,447 మంది చేనేత కార్మికులు ఉన్నారు






**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎన్‌హెచ్‌డిపి పథకం యొక్క చేనేత మార్కెటింగ్ సహాయంతో, చేనేతదారుల సేవా కేంద్రం, విజయవాడ, భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లోని చేనేతదారుల అభివృద్ధి కమిషనర్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలోని మొఘల్‌రాజపురంలోని ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో చేనేత కార్మికులు, చేనేత ఏజెన్సీల చేనేత ఉత్పత్తులు, చేతివృత్తులవారి ఖాదీ ఉత్పత్తుల అమ్మకం కోసం "నిచ్ హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్‌పో-2024-25"ను నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శన-కమ్-సేల్ 08.01.2025 నుండి 14.01.2025 వరకు (7) రోజుల పాటు ఉంటుంది. బీసీ సంక్షేమ, ఆర్థికంగా బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ప్రారంభోత్సవం కొనసాగింపుగా, ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్, సాంస్కృతిక నృత్యం ఈ నెల 09న, వీవర్స్ సర్వీస్ సెంటర్ విజయవాడ ఫ్యాషన్ షోను నిర్వహిస్తోంది. భారతదేశం అంతటా వివిధ రాష్ట్రాల నుండి సాంప్రదాయ చేనేత చీరల చక్కదనం, ఆకర్షణను ప్రదర్శిస్తుంది. గుంటూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ విద్యార్థులు అద్భుతమైన ఫ్యాషన్ షోలో తమ సృజనాత్మకత, ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. సాంస్కృతిక నృత్యం యొక్క తదుపరి కార్యకలాపం ఈ నెల11న జరుగుతుంది. ఉప్పాడ జమ్దానీ సిల్క్ చీర, కాటన్ చీర, మంగళగిరి కాటన్, సిల్క్ చీర, చీరాల కుప్పడం సిల్క్ చీర, పెడన కలంకారీ కాటన్ చీర, ఆంధ్రప్రదేశ్ నుండి శ్రీకాళహస్తి పెన్ కలంకారీ చీర, మహారాష్ట్ర నుండి పైథానీ సిల్క్ చీర ఫ్యాషన్ షోలో ప్రదర్శించబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ నుండి 29 మంది, వివిధ రాష్ట్రాల నుండి 20 మంది పాల్గొంటారు, మొత్తం 49 మంది చేనేత కార్మికులు, చేనేత సంఘాలు, చేనేత ఏజెన్సీలు అలాగే ఆప్‌కో, లేపాక్షి , తమిళనాడు కో-ఆప్టెక్స్ పాల్గొంటున్నాయి. వెంకటగిరి కాటన్ & సిల్క్ చీరలు, ఉప్పాడ జమ్దానీ చీరలు, ధర్మవరం సిల్క్ చీరలు, చీరాల కుప్పడం చీరలు, మంగళగిరి కాటన్ చీరలు & డ్రెస్ మెటీరియల్, ధర్మవరం పావడలు, పొందూరు షర్టింగ్ & బెడ్ షీట్లు, ఆంధ్ర ప్రదేశ్, గద్వాల్ పొలాక్ చీరలు, నారాయణపల్లి, గద్వాల పొదల చీరలు, సమాప్త చీరల విస్తృత శ్రేణి ఇక్కత్, ఇక్కత్ డ్రెస్ మెటీరియల్స్, టై & డై బెడ్ షీట్లు, డర్రీస్, తెలంగాణ నుండి, ఉత్తరప్రదేశ్ నుండి బనారస్ బ్రోకేడ్ చీరలు, రాజస్థాన్ నుండి కోట డోరియా చీరలు, బీహార్ & జార్ఖండ్ నుండి సిల్క్ చీరలు, మహారాష్ట్ర నుండి పైతాని చీరలు, పశ్చిమ బెంగాల్ తంగలి చీరలు, భారతదేశం నుండి ధోలి చీరల మీదుగా ధోడియోలే, మధ్యప్రదేశ్ నుండి సుధీరి చీరలు. అలాగే హస్తకళ ఉత్పత్తులు & ఖాదీ ఉత్పత్తులు ఎక్స్‌పోలో అందుబాటులో ఉన్నాయి. విజయవాడ నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆంధ్రప్రదేశ్, భారతదేశం అంతటా రంగురంగుల చేనేత వస్త్రాలు, చీరలను ఒకే చోట పొందాలని, మన పురాతన సాంప్రదాయ చేనేతలను ప్రత్యక్షంగా నిర్వహించడానికి కృషి చేసే చేనేత, చేనేత సంస్థలకు మద్దతు ఇవ్వాలని నేను ఇందుమూలంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

## చల్లపల్లిలో బారులుతీరిన భక్తులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ముక్కోటి ఏకాదశి సందర్భంగా చల్లపల్లి లోని శ్రీగరుడ ఆంజనేయ సహిత శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయానికి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు బారులుతీరారు. శుక్రవారం ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకూ ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచార్యులు స్వామివారికి విశేష పూజలు, ఆలంకరణలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు మోపిదేవి ద్వారకానాథ్, పత్రి హనుమంతరావు, నూజెళ్ల బాబు, ఉప్పాల ఏడుకొండలు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయం వెలుపల ఏర్పాటుచేసిన దేవతామూర్తుల ప్రతిమలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గర్భాలయంలో స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, వివిధ వర్గాల ప్రముకులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

## చివరి భూముల వరకూ సాగునీరందించటమే లక్ష్యం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడకుండా సమన్వయంతో పనిచేస్తూ కాలువ చివరి భూములవరకూ సాగునీరందించటమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని చల్లపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నిడమానూరి దిలీప కుమార్ కోరారు. చల్లపల్లి జలవనరులశాఖ కార్యాలయంలో చల్లపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డీసీ చైర్మన్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించటం ద్వారా సాగునీటి రంగానికి ప్రాధాన్యతను కల్పించిందన్నారు. ఇరిగేషన్, డ్రైనేజీ శాఖలను సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నీటిసంఘాలు కృషిచేయాలన్నారు. నీటిసంఘాల ప్రతినిధులు, అధికారులు సాగునీటిసంఘాల వారీగా కాలువలపై పర్యటించి చేపట్టాల్సిన పనులను గుర్తించగా ఆయా మరమ్మత్తుల గురించి సమావేశంలో చర్చించి ప్రణాళిక రూపొందించారు. చల్లపల్లి డీసీలోని 11 సంఘాల పరిధిలో 35 పనులు రూ. 12.30కోట్లతో చేపట్టాలని అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. ఇరిగేషన్ డీఈ పి.వెంకటేశ్వరరావు, ఏఈలు వి.రామ్కుమార్, పి. రవితేజ, డ్రైనేజీ శాఖ చల్లపల్లి డీఈ జె.బాబూనాయక్, బందరు డీఈ కిరణ్ బాబు, ఏఈలు పి.చిరంజీవి, నజ్మారాణిలు మాట్లాడుతూ వారి పరిధిలో చేపట్టాల్సిన పనులు, సమస్యలపై నీటిసంఘాల అధ్యక్షులతో చర్చించారు. డీసీ వైస్చైర్మన్ చిల్లా సీతారామయ్య, నీటిసంఘాల అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు, మత్తి నాగమల్లేశ్వరరావు, నూకల నరేష్కుమార్, చలమలశెట్టి వెంకట రమణారావు, కేసన రమేష్, గంజాల శ్రీరాములు, వేములపల్లి పిచ్చేశ్వరరావు, గొర్రెపాటి దుర్గానాగేశ్వరరావు, భోగిరెడ్డి సాంబశివరావు, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీకాకుళంలో ముక్కోటి ఏకాదశి



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న (ఆంధ్ర మహావిష్ణు) శ్రీకాకుళేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనంతో భక్తులు నయన మనోహరంతో తరించారు . ముందుగా స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, మండలి వెంకట్రావు (రాజా) కుటుంబంతో సహా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాకుళేశ్వర స్వామి గరుడ వాహనంపై ఉత్తర ద్వార దర్శనంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిషనర్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వచ్చిన భక్తులకు 10 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు .భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు అనంతరం గరుడ వాహనంపై స్వామి వారిని గ్రామోత్సవం నిర్వహించారు.

# కోడికి కత్తి కడితే యాక్షనే..

## పెనుగంచిప్రోలు సిఐ పి.వెంకటేశ్వర్లు స్ట్రాంగ్ వార్నింగ్







**పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట పరిధిలోని నందిగామ సబ్ డివిజన్ పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సంక్రాంతి సంబరాల పేరుతో కోడి పందాలు నిర్వహిస్తూ కోళ్లకు కత్తులు కడితే చర్యలు తప్పవని సిఐ పి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నవాబు పేట గ్రామంలో ఎటువంటి కోడిపందెలు, పేకాట, గుండాట లాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకూడదని నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా అనుమానిత ప్రదేశాలలో బరులకి సిద్ధం చేస్తున్న వాటిని ప్రొక్లైన్‌తో ఎస్ఐ అర్జున్, సిబ్బందితో కలిసి నిర్మూలించారు. ఈ సందర్భంగా సిఐ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఫంక్షన్ హాల్స్ లోనూ జూదం, కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం తమకు అందిందని అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా ఎపి గేమింగ్ యాక్ట్ ప్రకారం ఫంక్షన్ హాల్సును సైతం సీజ్ చేస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. అలాగే తమ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించ బోమన్నారు. కొంతమంది పొలాల్లో కోడిపందాలు, జూదాలు లాంటివి జరపాలని చూస్తున్నారని అటువంటి వాటికి అనుమతిలేదన్నారు. మరీ ముఖ్యంగా మీ చుట్టుపక్కల కోడిపందాలు, జూదం లాంటివి జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పోలీసుల ఆదేశాలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఎస్ఐ అర్జున్ మాట్లాడుతూ తమ పరిధిలో కోడిపందాలకు అనుమతిలేదని అటువంటివి నిర్వహిస్తే ఎంతటి వారిపైన అయినా యాక్షన్ తప్పదన్నారు. మరీ ముఖ్యంగా కోడిపందాల పేరుతో జూదం, గుండాడ లాంటివి అస్సలు ఉపేక్షించేదిలేదన్నారు.

# పామర్రులో కోడిపందాల నిర్వాహణకు భారీగా ఏర్పాట్లు



**పామర్రు జనవరి 10 మేజర్ న్యూస్ :** సంక్రాంతి సంబరాలు ముసుగులో భారీగా కోడి పందాలు, జూదం నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. మండల కేంద్రమైన పామర్రు సమీపంలో మండల స్థాయిలో కోడిపందాల పేరిట భారీగా జూదక్రీడలు నిర్వహించనున్నారు అనే సమాచారం గ్రామాల్లో విస్తరించింది. నిర్వాహకులు ఇప్పటికే కోడిపందాలకు సంబంధించిన బరులను సిద్ధం చేస్తున్నారు. సిమెంట్ స్తంభాలను భూమిలో పాతి చుట్టూ ఫెన్సింగ్ వేసి మధ్యలో పందాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడా కోడిపందాలు వేసేందుకు అనుమతులు లేవంటూ జిల్లా, డివిజన్ స్థాయి రెవెన్యూ, పోలీసు అధికారులు ఒక పక్కన భారీ ప్రకటనలు చేస్తున్నా నిర్వాహకులు మాత్రం తమ పనులు తాము సాగిస్తూనే ఉన్నారు. పామర్రు మండలంలో పామర్రు నుండి గుడివాడ వెళ్ళు జాతీయ రహదారి పక్కనే నిర్వాహకులు బరులను ఏర్పాటు చేస్తున్నా కనీసం రెవెన్యూ అధికారులు, కానీ పోలీసు అధికారులు కానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. సంక్రాంతి సంబరాల పేరిట సాగే కోడిపందాలలో భాగంగా కోతముక్క, పేకాట, గుండాట వంటి వాటిని నిర్వహించేందుకు ఇప్పటికే నిర్వాహకులు భారీ మొత్తంలో నగదు వసూలు చేసినట్లు తెలుస్తోంది. గతంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులు కోడిపందాలు నిర్వహించగా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి పార్టీ కి చెందిన నాయకులు, కార్యకర్తలు కోడిపందేల నిర్వహణకు భారీ ఏర్పాటు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన యువ నాయకుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

# హజరత్ సయ్యద్ షా బుఖారి బాబా ఉరుసు మహోత్సవంలో సీపీ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్. జిల్లా, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిది, కొండపల్లి పట్టణ పరిధిలోని హజరత్ సయ్యద్ షా బుఖారి బాబా దర్గా 428వ ఉరుసు మహోత్సవ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు ముఖ్య అతిదిగా పాల్గొని దర్గాలో ప్రత్యేక చాదర్ సమర్పించి ప్రార్ధనలు నిర్వహించారు. ఈ నేపధ్యంలో ఉరుసు మహోత్సవ కమిటీ సభ్యులు నగర పోలీస్ కమీషనర్‌ని సాదరంగా మేళ తాళాలతో ఆహ్వానించినారు, నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్ధన నిర్వహించారు. అనంతరం కొండపల్లి ఆస్థాన పీఠాధిపతి, షా బుఖారి బాబా నిత్యాన్నదాన నిర్వాహకులు అల్తాఫ్ బాబ్లా నగర పోలీస్ కమీషనర్‌ని ఇస్లాం సంప్రదాయ ప్రకారం సన్మానించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్



మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం ఉరుసు మహోత్సవంలో పోలీస్ శాఖ తరపున చాదర్ సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని, ఆనవాయితీని కొనసాగిస్తూ తాను కూడా చాదర్ సమర్పించినట్లు తెలిపారు. ఉరుసు మహోత్సవంలో పాల్గొనడం సంతోషకరమని, కుల మతాలకు అతీతంగా భక్తులు బాబావారిని సందర్శించటం మత సామరస్యానికి చిహ్నామని తెలిపారు.ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గంధం సమర్పించే సమయంలో భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక బందోబస్తు నిర్వహించాలని, అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. ఇక్కడ నిత్యం జరిగే అన్నదాన కార్యక్రమం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం కొద్ది సేపు అన్నదాన కార్యక్రమంలో వడ్డన చేసారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్, పశ్చిమ జోన్ ఏ.డి.సి.పి. గుణ్ణం రామకృష్ణ, పశ్చిమ ఏ.సి.పి. దుర్గారావు, ఇబ్రహీంపట్నం ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా ఎన్నికైన మట్ట శేషు నారాయణ రావు సత్కారం

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా మట్ట శేషు నారాయణ రావుని నియమించిలోన గౌరవ పరంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, మాజీ ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మల్లాది విష్ణువర్ధన్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా నియామకమైన మట్ట శేషు నారాయణ రావును మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తదితర వైసీపీ నేతలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకుడు ప్రబల శ్రీనివాస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రామ్స్ థియేటర్‌లో మరింత వినోదం



**విజయవాడ మేజర్ న్యూస్ :** గుణదలలోని రాంగోపాల్ థియేటర్ నేటి నుంచి రామ్స్ థియేటర్‌గా నగరవాసులకు వినోదాన్ని అందించనుందని థియేటర్ అధినేత యలమంచిలి రామ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా సంక్రాంతి పండుగ సందర్భంగా సరికొత్త సినిమాలతో రామ్ సినిమాస్ నగర వాసులను అలరించునుందని తెలిపారు. రామ్ సినిమాస్ రెండు స్క్రీన్ లతో, డిజిటల్ సౌండ్ సిస్టం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గత 48 సంత్సరాలుగా విజయవాడలో రాంగోపాల్ థియేటర్‌గా అల్లరించిందని, ఇక నుండి రామ్ సినిమాస్‌గా అందరి ముందుకు వస్తుందని అన్నారు. థియేటర్‌లో విశాలామైన కార్ పార్కింగ్ తో పాటు, స్కూటర్ పార్కింగ్ కూడా ఉందని అన్నారు. టికెట్స్ థియేటర్ తో పాటు బుక్ మై షో ద్వారా ఆన్ లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి అధ్యక్షులు కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్స్ థియేటర్స్ ను కాపాడుకోవడమే నిర్మాతల లక్ష్యమని తెలిపారు. సామాన్య ప్రేక్షకులకు సింగిల్ స్క్రీన్ ద్వారా సినిమాలను తక్కువకే అందిస్తామని వివరించారు. ఈ సమావేశంలో యలమంచిలి రాహుల్, యలమంచిలిరోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకి ముఖ్య గమనిక

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** శనివారం అనగా 11 వ తేదీ నా అవనిగడ్డ మండలం నాగాయలంక రోడ్ లో గల కొత్త సబ్ స్టేషన్ పరిధిలో గల లైన్ మరమత్తులు, విద్యుత్ లైన్ల పై వాలిన చెట్ల కొమ్మలను ట్రిమ్ చేయటం కొరకు కొత్త సబ్ స్టేషన్ పరిధి లో గల అవనిగడ్డ గ్రామము లోని కొంత మేరకు, అవనిగడ్డ మండల పరిధిలో గల బందలాయిచెరువు, గ్రామములకి ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నాము 01:00 గంట వరకు విద్యుత్ అంతరాయము కలుగును కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరు అని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999